# ఉపాయం



సర్దార్ గురుబచన్ సింగ్, విశ్వనాథ్ మిశ్రాలు వేటకి బయలుదేరారు.

కొట్టే పులినే కొట్టాలన్నట్లు- పిట్టల్నీ, మామూలు అడవి జంతువులనూ ఏమి కొట్టాంలే... అనుకొని పులులను కొట్టే ఉద్దేశంతో ఆ దట్టమైన అడవికి బయలుదేరారు వాళ్ళు.

జీప్ వేగంగా పోతోంది. అక్కడంతా కొండల మయం. ఆ కొండల మీద నుంచి, వాటి మధ్య నుంచి పాము మెలికల్లాగా వున్న రోడ్ మీద నుంచి జీప్ సాగిపోతోంది.

కొంచెం సేపట్లో అడవి ప్రారంభమయింది. దూరం పోతున్నకొద్దీ అది దట్టమై, మరింత దట్టం కాగా ఇంక ముందుకు సాగలేని చోట జీప్ ఆపాడు డ్రైవర్.

కొంచెం ముందుగా దట్టంగా ఉన్న వృక్షాల మధ్య ఒక చిన్న గుట్ట పైకి పొడుచుకొచ్చి కనిపిస్తోంది. దాని తలం నున్నగా ఉండడంతో, దాని పైకి ఎక్కి నలువైపులా చూస్తే సమీపంలో పులి కానీ, మరే జంతువు కానీ ఎక్కడున్నా కనిపిస్తుందనిపించింది.

అయితే ఆ సమీపంలో జీప్ కానీ, మనిషి కానీ కనిపిస్తే అవేవీ అటు రావనిపించి డ్రైవర్‌ని జీపు తీసుకుని దిగువన కొంత దూరం తీసుకుపోయి అక్కడ ఉండమన్నారు. అవసరమైనప్పుడు గుట్ట మీద నుంచి సైగ చేస్తానని, అది చూసి జీపును తీసుకురమ్మనీ చెప్పారు. డ్రైవర్ జీపు తీసుకుని వెళ్లిపోయాడు.

గురుబచన్, మిశ్రా చేతుల్లో తుపాకులు పట్టుకుని జాగ్రత్తగా అన్నివైపులా చూసుకుంటూ ముందుకి వెళ్లసాగారు. మధ్య మధ్యన ఆగి బైనాక్యులర్స్ తీసి, పులి కాకపోయినా మరే పెద్ద జంతువైనా కనిపిస్తుందేమోనని అందులోంచి చూడసాగారు.

మిత్రులిద్దరూ అలా అలా నెమ్మదిగా నడుచుకుంటూ చాలా దూరమే వెళ్లారు. అయితే వారి దురదృష్టం కొద్దీ, వాటి అదృష్టం కొద్దీ ఒక్క జంతువు కూడా కనిపించలేదు. కనీసం ఒక నక్క కూడా కనిపించలేదు.

అప్పటికే చాలా ఆలస్యం అయింది. చీకటి పడే సమయం అయింది.

ఒక్క జంతువైనా దొరకలేదన్న నిరాశకు తోడు- అలసట విపరీతంగా వేయసాగింది. ఇంక వేటకు నమస్కారం పెట్టి ఇంటి ముఖం పట్టాలనుకున్నారు. జీప్ దాకా నడిచి వెళ్లే బదులు జీప్‌నే తామున్న చోటికి తెప్పిస్తే బాగుంటుందనిపించింది విశ్వనాథ్ మిశ్రాకి.

వెంటనే చప్పట్లు కొట్టి జీప్ డ్రైవర్‌కి సంజ్ఞలు చేయడం మొదలుపెట్టాడు. కాని దూరం ఎక్కువ ఉండడంతో అతని పిలుపులు డ్రైవర్‌కి వినిపించలేదు. పదే పదే చప్పట్లు కొట్టినా వినిపించలేదు. ఇది చూసేసరికి గురుబచన్ సింగ్‌కి చిర్రెత్తుకొచ్చింది.

"ఇంత దూరాన్నించి పిలిస్తే డ్రైవర్‌కి వినిపిస్తుందా? నేను పిలుస్తాను చూడు!" అంటూ బైనాక్యులర్స్ తీసి అందులో దగ్గరగా ఉన్నట్లు కనిపిస్తున్న డ్రైవర్‌ని చూస్తూ ఒక చేత్తో రమ్మని సంజ్ఞ చేస్తూ గట్టిగా పిలవసాగాడు సర్దార్ గురుబచన్ సింగ్.

- విశ్వ రచన పక్ష పత్రిక... *16 అక్టోబర్ ' 98*